సాక్షి ప్రకాశం

గురువారం । 29 । మే । 2025



వేలాడు చుండెన్.. ప్రాణాలు తీయంగ!

చిన్నపాటి గాలి వీచినా, వర్షాలు కురిసినా విద్యుత్ తీగలు తెగిపడి యమపాశాలవుతున్నాయి. - 8లో..



రెవెన్యూ రికార్డుల తనిఖీ

మర్రిపూడిలో అక్రమంగా భూములను ఆన్‌లైన్ చేయడంపై కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో ఆర్డీఓ విచారణ చేపట్టి రికార్డులు పరిశీలించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34 /29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు

ఒంగోలు సిటీ: స్కూల్ అసిస్టెంట్ నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతుల కార్యక్రమం స్థానిక డీఆర్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 29వ తేదీ గురువారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు డీఈఓ ఏ.కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ లిస్టులో 249 నంబర్ వరకు పేర్లు ఉన్న వారు ప్రమోషన్లకు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుడు అరెస్టు

సాక్షి ఎఫెక్ట్..

యర్రగొండపాలెం: పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టులో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపుపై బుధవారం మార్కాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులు దాడులు దాడులు చేసి ఆ షాప్ యజమాన్ని అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న 20 మద్యం బాటిళ్లు సీజ్ చేశారు. 'దేవరాజుగట్టులో ఓపెన్ బెల్ట్ షాపు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆ శాఖ ఎస్సై ఎంవీ గోపాలకృష్ణ స్పందించి దాడులు చేశారు. బెల్ట్‌షాపులు నిర్వహించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నలుగురు చిన్నారులకు విద్యుత్ షాక్



ఒరిగిన విద్యుత్ స్తంభం

చీమకుర్తి రూరల్: మండలంలోని కూనంనేనివారిపాలెం సచివాలయం సమీపంలో బీసీకాలనీ చిన్నారులు నలుగురు బుధవారం విద్యుత్ షాక్‌కు గురయ్యారు. స్థానికుల సమాచారం మేరకు.. బీసీ కాలనీ దగ్గర విద్యుత్ స్తంభం ఒరిగిపోవడంతో తీగలు కిందకు జారిపోయి నేలకు మూడడుగుల ఎత్తులోనే ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఆడుకుంటున్న చిన్నారులు రేవూరి ధనుష్, పాలకీటి దివ్య, పాలకీటి దీపిక, దాసరి విజయలక్ష్మి విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురయ్యారు. అందరూ క్షేమంగా బయటపడటంతో వారి కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అధికారులు స్పందించి తక్షణమే సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీ వేమా అశ్విని, స్థానికులు డిమాండ్ చేశారు.

ప్రశాంత జీవనానికి యోగా ఉత్తమం

- ఎస్పీ ఏఆర్ దామోదర్



ఒంగోలు టౌన్: శారీరక, మానసిక ఆరోగ్యానికి, ప్రశాంత జీవనానికి యోగా ఏకైక మార్గమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా బుధవారం పోలీసు కల్యాణ మండపంలో యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..పోలీసు సిబ్బంది రోజువారి విధి నిర్వహణలో ఒత్తిడి ఎదుర్కొంటూ ఉంటారని చెప్పారు. మానసిక ఒత్తిడిని తగ్గించే శక్తి యోగాకు ఉందన్నారు. యోగా అంటే కేవలం ఆసనాలు మాత్రమే కాదని, శరీరం, మనసు మధ్య సమతుల్యం ఏర్పరిచే సాధనమన్నారు. డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐలు నాగరాజు, విజయకృష్ణ, మేడా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఐఈఓగా ఆంజనేయులు



తాళ్లూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఆంజనేయులు డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఐఈఓ)గా పదోన్నతి వచ్చింది. ఈ మేరకు కాలేజీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్తీక్ శుక్లా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కూటమి ఏలుబడిలో జిల్లా అభివృద్ధి అంతా తిరోగమనమే. ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్ అంటూ అలవికాని హామీలిచ్చిన కూటమి పార్టీలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలు విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ఏడాది పాలనలో జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులను ఒకసారి పరిశీలిస్తే ఒక్కటంటే ఒక్కదానికి కూడా ముందడుగు పడలేదు సరికదా.. ఉన్నవన్నీ వెనక్కిపోతున్నాయి. ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభం కావాల్సి ఉన్న మెడికల్ కళాశాల అటకెక్కింది. మార్కాపురాన్ని జిల్లా చేస్తామంటూ పశ్చిమ ప్రాంత ప్రజలను ఊరించారు. అధికారంలోకి వచ్చీరాగానే వెలిగొండ ప్రాజెక్టును ఏడాదిలో పూర్తి చేసి నీళ్లు విడుదల చేస్తామని రైతాంగాన్ని నమ్మబలికారు. ట్రిపుల్ ఐటీ కాలేజీకి సొంత భవనాలు నిర్మిస్తామని విద్యార్థులకు ఆశలు కల్పించారు. దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసి జిల్లాకు పరిశ్రమలు తీసుకొస్తామని నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చారు. ఒంగోలు ప్రజల దాహార్తి తీర్చే ప్రాజెక్టును పూర్తి చేస్తామని నగర ప్రజలకు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పిన మాటలన్నింటినీ గంగలో కలిపేశారు. జిల్లా ప్రజలకు మేలు చేయడం మాట అటుంచి తీరని నష్టం చేస్తున్నారు. విమానాశ్రయం, హార్బర్, ఒంగోలు మంచినీటి పథకాలు అందని ద్రాక్షగా మిగిలిపోనున్నాయి.

నిత్య ఆశలు.. గాల్లో మేడలు..!

- దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామంటూ పట్టించుకోని కూటమి పాలకులు
- ట్రిపుల్ ఐటీ ఒంగోలు క్యాంపస్ ఎత్తివేసి ఇడుపులపాయకు తరలింపు
- ఒంగోలు ప్రజల దాహార్తి తీర్చే ప్రాజెక్టును అటకెక్కించారు.
- ఒక్క హామీ అమలు చేయకుండా నిత్య కలహాలతో కాలయాపన చేస్తున్న కూటమి పాలకులు

వెలిగొండకు మొండిచేయి

మార్కాపురం జిల్లా పట్టాలెక్కేనా

ఒంగోలు ఎయిర్‌పోర్ట్ కొత్త నాటకం

మెడికల్ కళాశాలకు గ్రహణం



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లా అభివృద్ధికి అది చేస్తాం..ఇది చేస్తామంటూ చాలా హామీలిచ్చారు. నోటికొచ్చినట్లు వాగ్దానాలు చేశారు. తీరా హామీల అమలును ప్రశ్నిస్తే సోషల్ మీడియా కేసులు పెట్టి వేధిస్తున్నారు. పోలీసులను ఉసిగొల్పి చుక్కలు చూపిస్తున్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు కూటమిలో కుంపటి రాజేసి కలహాలతో కాలపయాపన చేస్తున్నారు.

ఏడాది పాలన ఇదేనా బాబూ!




ట్రిపుల్ ఐటీ తరలింపు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సొంత భవనాలు నిర్మించి అభివృద్ధి చేస్తామని గత ఎన్నికల్లో చంద్రబాబుతో పాటు ఒంగోలు టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. అదంతా నిజమేనని జిల్లా ప్రజలు నమ్మారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రిపుల్ ఐటీకి సొంత భవనాలు నిర్మించకుండా ఏడాదిగా కాలయాపన చేస్తున్నారు. అంతేగాకుండా గత ప్రభుత్వ హయాంలో ఇడుపులపాయలో ఇబ్బంది పడుతున్న ఒంగోలు క్యాంపస్ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వారిని ఒంగోలు తరలించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఒంగోలు క్యాంపస్ విద్యార్థులను తిరిగి ఇడుపులపాయకు తరలిస్తోంది. ఈ నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అటకెక్కిన మంచినీటి పథకం...

రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న ఒంగోలు నగరంలో 3.50 లక్షల జనాభా ఉన్నారు. 50 డివిజన్లకుపైగా విస్తరించింది. అయితే, ఒంగోలు నగర, నగర శివారు ప్రాంతాల ప్రజలను మంచినీటి కొరత వేధిస్తోంది. జిల్లా పర్యటనకు వచ్చిన ఆప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు. నగర ప్రజలకు ప్రతిరోజూ మంచినీరు అందించేందుకు రూ.350 కోట్లు మంజూరు చేశారు. దీనికి పరిపాలనాపరమైన అనుమతులు కూడా వచ్చేశాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం పూర్తిగా అటకెక్కింది.





నామమాత్రంగా నిధులు...

ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో సుమారు 4.50 లక్ష ల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మందికి తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టును దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. గొట్టిపడియ, సుంకేశుల, కాకర్ల డ్యాములు నిర్మించారు. ఆ తరువాత అధికారం చేపట్టిన టీడీపీ పాలనలో వెలిగొండ పనులు మూలనపడ్డాయి. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈలోగా ఎన్నికలు రావడంతో కొన్ని పనులకు ఆటంకం ఏర్పడింది. అధికారంలోకి వచ్చాక వెంటనే వెలిగొండ ప్రాజక్టు పూర్తిచేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు రాష్ట్ర బడ్జెట్లో కేవలం రూ.309.13 కోట్లు మాత్రమే కేటాయించారు. రూ.4 వేల కోట్లు కేటాయిస్తే పునరావాస కాలనీలు, ఆర్ఆర్ ప్యాకేజీ, ఇతర పనులు పూర్తవుతాయని నిపుణులు చెబుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.



దొనకొండ కారిడార్ సంగతేంటి..?

బాబు దొనకొండను పారిశ్రామిక కారిడార్ చేస్తానంటూ హంగామా చేశారు. 2014-19లో దొనకొండకు ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదు. తిరిగి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదేపాట పాడుతున్నారు. దొనకొండలో 25 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర విభజన సమయంలో దొనకొండలో రాజధాని ఏర్పాటు చేయాలని శ్రీకృష్ణ కమిటీ నివేదిక ఇచ్చింది. ప్రజల నుంచి కూడా పెద్ద ఎత్తున డిమాండ్ వచ్చింది. అవేవీ పట్టించుకోని చంద్ర బ్రిటీష్ పాలనలో ఇక్కడ ఏర్పాటు చేసిన విమానాశ్రయాన్ని మూలనపడేశాడు. నిజానికి దొనకొండను పారిశ్రామికకారిడార్‌గా చేసేపనైతే విమానాశ్రయాన్ని ఒంగోలు తరలించడం దేనికనే ప్రశ్నకు సమాధానం లేదు.

ఇంతకూ ఒంగోలుకు విమానాలు వస్తాయా..?


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒంగోలులో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల కొంత హడావిడి చేయడం తెలిసిందే. విమానాశ్రయం కోసమని కొత్తపట్నం మండలంలోని అల్లూరు వద్ద స్థలాన్ని ఏవియేషన్ అధికారులు పరిశీలించి వెళ్లారు. ఇప్పటి దాకా దాని మీద ఎలాంటి పురోగతి లేదు. నిజంగానే ఒంగోలులో విమానాశ్రయాన్ని నిర్మిస్తారా అనే సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. దొనకొండలో ఉన్న విమానాశ్రయాన్ని ఏమాత్రం పట్టించుకోని ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంగోలులో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తానంటే నమ్మబుద్ధికావడం లేదని పెదవి విరుస్తున్నారు. కొత్తపట్నం తీరంలో హార్బర్ నిర్మిస్తామని చెప్పి గాలికొదిలేశారు.



మెడికల్ కళాశాలపై పచ్చపడగ...

మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్లు మంజూరు చేసి 75 వెనకబడిన పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలు ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తినప్పుడు మెరుగైన చికిత్స కోసం గుంటూరు, విజయవాడ, కర్నూలు, హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. ఇది గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య విద్యతో పాటు పశ్చిమ ప్రజలకు వైద్య చికిత్స అందించే లక్ష్యంతో మార్కాపురంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. రాయవరం వద్ద 41.97 ఎకరాల విస్తీర్ణంలో శాతం పనులు పూర్తి చేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో మెడికల్ కళాశాల ప్రారంభించాలని భావించారు. ఊహించని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని నిలిపివేసింది. అక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర సిబ్బందిని బదిలీ చేసింది. దీన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు కుట్రలు చేస్తోంది.

ప్రకటనలు దాటని జిల్లా ఏర్పాటు...



ఎన్నికల ప్రచారంలో మార్కాపురాన్ని జిల్లా చేస్తామని చంద్రబాబు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా చేసిన తరువాతనే మార్కాపురంలో అడుగుపెడతానంటూ పశ్చిమ ప్రకాశం ప్రజలను నమ్మించారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తోంది. ఇప్పటికీ ఆయన రెండుసార్లు మార్కాపురం వచ్చి వెళ్లారు. మొదటిసారి పర్యటనలో మార్కాపురంను జిల్లా చేయడం ఇప్పట్లో కుదరదని తేల్చి చెప్పారు. రెండోసారైనా ఏమైనా చెబుతారేమోనని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూశారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి మార్కాపురం వచ్చిన ఆయన జిల్లా గురించి ప్రస్తావించకుండా వెళ్లిపోయారు. చంద్రబాబు ఏదైనా మాట ఇచ్చారంటే దానిని చేయరని అర్థం చేసుకోవాలని పశ్చిమ ప్రాంత ప్రజలు నిట్టూరుస్తున్నారు.

జిల్లా ప్రజలను నమ్మించి దగా చేసిన కూటమి



జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన వెలిగొండ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం విస్మరించింది. తక్షణమే రూ.2 వేల కోట్లు అవసరం కాగా కేవలం రూ.309 కోట్లు కేటాయించడం దీనికి నిదర్శనం. మార్కాపురంను జిల్లా చేస్తామన్నారు. ఇప్పుడు దాన్ని కనీసం మాటమాత్రంగానైనా ప్రస్తావించడం లేదు. జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్యారంగం అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అధికారపార్టీ ఎమ్మెల్యేలకు జిల్లా అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదు.

– కంకణాల ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

దొనకొండపై చిన్నచూపు...



దొనకొండలో బ్రిటీష్ కాలంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేశారు. కానీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎయిర్‌పోర్టును ఒంగోలు తీసుకెళ్లడం సరైన పద్ధతి కాదు. ఇది ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేయడమే. పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేస్తామని ప్రజలను మభ్యపెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. దొనకొండలో డిఫెన్స్ హబ్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు కేరాఫ్‌గా మారే అవకాశం కల్పిస్తామని, దొనకొండను అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు ఉత్తుత్తిగానే మిగిలిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం నిజాయితీగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటే పరిశ్రమలు స్థాపించి మౌలిక సదుపాయాలు కల్పించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి.

– చిరుపల్లి అంజయ్య, దొనకొండ

వెలిగొండను తక్షణమే పూర్తి చేయాలి



కూటమి ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలి. అధికారంలోకి రాగానే వెలిగొండ పూర్తి చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏడాదైనా అతిగతి లేదు. ఇంత వరకు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదు. పునరావాస కాలనీలు పూర్తి కాలేదు. ముంపు గ్రామం కావడంతో అభివృద్ధి పనులు జరగడం లేదు. మా నిర్వాసితుల త్యాగాన్ని ప్రభుత్వం గుర్తించి త్వరగా ఆర్ఆర్ ప్యాకేజీ ఇచ్చి కాలనీలను పూర్తి చేసి పునరావాసం కల్పించాలి.

– నల్లబోతుల కొండయ్య, గొట్టిపడియ నిర్వాసితులు, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

మార్కాపురం జిల్లా ఏమైంది



అధికారంలోకి రాగానే మార్కాపురం జిల్లా చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇంత వరకు ఆచరణలోకి రాలేదు. మార్కాపురాన్ని జిల్లా చేస్తేనే మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయి. ప్రస్తుతం పుల్లలచెరువు, అర్ధవీడు మండలాల ప్రజలు ఒంగోలు వెళ్లాలంటే 150 నుంచి 170 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. జిల్లా చేస్తే కేంద్రం నుంచి వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు పశ్చిమ ప్రకాశంకు వస్తాయి. తద్వారా మార్కాపురం ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

– గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘ నాయకుడు

మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలి



మార్కాపురంలో అర్ధంతరంగా ఆగిపోయిన మెడికల్ కాలేజీని ప్రభుత్వమే పూర్తి చేయాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీ మంజూరై పనులు చాలా వరకు పూర్తయ్యాయి. మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజలు గుంటూరు, ఒంగోలు వెళ్లాల్సిన పని లేదు. ఈ ఏడాదే ప్రభుత్వం ఎంబీబీఎస్ అడ్మిషన్లు కూడా ప్రారంభించాలి.

– విరోజీరావు, మార్కాపురం

కార్డుదారులందరికీ రేషన్ అందాలి

- రేషన్ షాపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఒంగోలు సబర్బన్:

కార్డుదారులందరికీ సకాలంలో రేషన్ అందాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పౌర సరఫరాల శాఖ అధికారులు, రేషన్ దుకాణాల డీలర్లను ఆదేశించారు. ఒంగోలు నగర పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలో ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీని చేపడుతున్న విషయం తెలిసిందేనన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలో రేషన్ షాపుల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నెలాఖరు నాటికి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖాధికారులను ఆదేశించారు. గ్రామంలో ఎంతమంది కార్డుదారులు ఉన్నారు, ఎంత రేషన్ సరఫరా చేశారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ షాపుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పద్మశ్రీ, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, ఒంగోలు తహసీల్దార్ మధుసూదనరావు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.



చెరువుకొమ్ముపాలెంలోని రేషన్‌షాపును పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాను సస్యశ్యామలం చేయాలి

- కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ నోడల్ అధికారి దినేష్‌కుమార్ పెరివాల్

ఒంగోలు సబర్బన్: సవాళ్లను అధిగమించి జిల్లాను సస్యశ్యామలం చేసేలా పథకాలు అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జలజీవన్ మిషన్ కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారి వాగేష్ తివారీ, డాక్టర్ దినేష్ కుమార్ పెరివాల్ అన్నారు. జలజీవన్ మిషన్ కింద జిల్లాలో చేపట్టిన పనులను పరిశీలించేందుకు వచ్చిన ఇద్దరు అధికారులు కలెక్టర్‌తో కలిసి ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు జిల్లాలో జలజీవన్ మిషన్ పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా భౌగోళిక పరిస్థితి, వర్షం నీటిని ఒడిసిపట్టేందుకు, భూగర్భ నీటి మట్టాన్ని, పచ్చదనాన్ని పెంచేందుకు, నీటి వనరుల మరమ్మతులకు చేపట్టిన చర్యలు వివరించారు. గ్రౌండ్ వాటర్ ఈఈ విద్యాసాగర్ మాట్లాడుతూ జిల్లాలోని 12 మండలాల్లో 93 గ్రామాలను పరిమితికి మించి భూగర్భ జలాలను వాడినట్లుగా గుర్తించామన్నారు. అయితే జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలతో భూగర్భ నీటిమట్టం ఏడాదిలోనే సగటున 3 మీటర్లు పెరిగిందన్నారు. దీనిపై వాగేష్ తివారీ స్పందిస్తూ జిల్లాలోని క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించేందుకు ఈ నెల 29, 30 తేదీల్లో వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తామన్నారు. డీపీఓ గొట్టిపాటి వెంకటనాయుడు, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



జలజీవన్ మిషన్ నోడల్ అధికారులకు వివరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

క్లుప్తంగా

పులి దాడిలో ఆవు మృతి?



ఆర్ధవీడు: పాపినేనిపల్లె ఫారెస్టు బీట్ పరిధిలోని నారాయనపల్లి గ్రామ కొండ అంచు వ్యవసాయ పొలాల్లో ఆవుపై అడవి మృగం దాడి చేసి చంపింది. బొప్పాయి తోటలో ఆవు మరణించి ఉండటాన్ని రైతులు బుధవారం మధ్యాహ్నం గుర్తించారు. ఆవు మెడ, ఎడమ కాలిపై మృగం కొరికిన ఆనవాళ్లు ఉండటంతో పులి దాడి చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. పులి సంచరిస్తోందన్న వార్త ఆనోటా ఈనోటా తెలియడంతో నారాయనపల్లితోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆవు మృతి చెందిన విషయం అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో ట్రాప్ కెమెరాలు అమర్చారు. బుధవారం రాత్రి కెమెరాల పుటేజీని పరిశీలించి ఏ జంతువు దాడి చేసిందో నిర్ధారిస్తామని ఫారెస్ట్ బీట్ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

ఆర్మీ జవాన్ మృతిపై కేసు నమోదు



రవి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నాగరాజు

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల గ్రామంలో ఆర్మీ జవాన్ రవి(41) మంగళవారం ఉదయం మృతి చెందారు. రాజస్థాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన సెలవుపై గత సోమవారమే స్వగ్రామానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం వేకువజామున కుటుంబ సభ్యులు ఎంతగా పిలిచినా లేవకపోవడంతో మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. రవి తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు బుధవారం తెలిపారు. మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనారోగ్యంతో మరణించారా మరేదైనా కారణమా అనేది పోస్టుమార్టంలో వెల్లడవుతుందని ఎస్సై చెప్పారు.



కంభం సమీపంలోని పంట పొలాల్లో తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



కందులాపురం సెంటర్‌లో ఆలయంపై తెగి పడిన మెయిన్ లైన్ తీగలు(ఫైల్)



లింగాపురం పంట పొలాల్లో మృతి చెందిన యర్రబాలెం వాసి వెలుగొండయ్య(ఫైల్)

వేలాడుచుండెన్.. ప్రాణాలు తీయంగ!

- ప్రమాదకరంగా విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- మృత్యువాత పడుతున్న రైతులు, మూగజీవాలు
- కంభం సబ్ డివిజన్‌లో ఏడాది వ్యవధిలో ప్రాణాలు కోల్పోయిన 12 మంది
- 17 సార్లు జరిగిన ప్రమాదాల్లో 30 వరకు పశువులు మృతి
- నష్ట నివారణ చర్యలపై విద్యుత్ శాఖ దృష్టి సారించాలని ప్రజల డిమాండ్

కంభం: చిన్నపాటి గాలి వీచినా, వర్షాలు కురిసినా పంట పొలాలు, గ్రామాలు, పట్టణాల్లో విద్యుత్ తీగలు తెగిపడి యమపాశాలవుతున్నాయి. ఈదురు గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతోపాటు హైటెన్షన్ వైర్లు సైతం తెగి పడి మూగజీవాల ప్రాణాలు తీస్తున్నాయి. సరైన రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అజాగ్రత్తగా ఉన్న రైతులు, ఇళ్లలో పనిచేస్తున్న సమయంలో వ్యక్తులు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నారు. పలు చోట్ల కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, పంట పొలాల్లో తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గడిచిన ఏడాది కాలంలో కంభం విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల్లో 12 మంది మృత్యువాత పడగా సుమారు 30 కు పైగా గేదెలు ప్రాణాలు కోల్పోయాయి. పట్టణాల్లోని ప్రధాన వీధులు, ఆర్‌అండ్‌బీ రహదారుల్లో పలుమార్లు విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్‌లు దగ్ధమైన సంఘటనలు ఉన్నాయి.



కంభం చెరువుకు వెళ్లే దారిలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు



ఎల్.కోటకు చెందిన రైతు ప్రసాదరావు(ఫైల్)

పంట పొలాల్లో ప్రమాద ఘంటికలు

పంట పొలాల్లో విద్యుత్ తీగలు, స్తంభాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. అరటి తోటల మీదుగా విద్యుత్ లైన్లు తాకుతూ వెళ్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో ఒరిగిన స్తంభాలు ఏక్షణం కూలిపోతాయోనన్న భయం రైతులను వేధిస్తోంది. తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ క్యారియర్ల వద్ద తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో మేత మేసే క్రమంలో అటుగా వెళ్లిన గేదెలు చనిపోతున్నాయి. అడవి పందుల బారి నుంచి పంటను రక్షించుకునేందుకు కొందరు వ్యక్తులు తమ పొలం కంచెకు విద్యుత్ తీగలు తగిలిస్తుండటంతో ప్రాణాంతకంగా మారుతున్నాయి.

సమస్యలపై శ్రద్ధ అవశ్యం

ఈదురుగాలుల ధాటికి విద్యుత్ తీగలు పడిపోతే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్న ఆ శాఖ సిబ్బంది.. ఆ తర్వాత వాటి గురించి పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించి, పంట పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

మృతుల్లో రైతులే అధికం

గత ఏడాది మేలో బేస్తవారిపేట మండలం ఎంపీ చెరువులో పొలంలో విద్యుదాఘాతానికి గురై రైతు జె.నారాయణ, ఆగస్టులో శింగరపల్లికి చెందిన రవీంద్ర, ఒందుట్లకు చెందిన రైతు బి.రమేష్ మృతి చెందారు. సెప్టెంబర్‌లో కంభంలోని ఓ గృహంలో గ్రానైట్ పనిచేస్తూ విద్యుదాఘాతానికి గురై షేక్ ఖలీల్ అనే కూలి ప్రాణాలు కోల్పోయాడు. నవంబర్‌లో కంభం మండలం ఎల్‌కోట గ్రామానికి చెందిన రైతు టి.ప్రసాద్‌రావు, డిసెంబర్‌లో చిన్నకంభం గ్రామానికి చెందిన కె. కమల్‌రాజ్, బేస్తవారిపేటకు చెందిన కె.కాశమ్మ, అర్ధవీడు మండలం వెలగలపాయలో రైతు సి.వెంకటరత్నం మృత్యువాతపడ్డారు.

ఈ ఏడాది మార్చిలో బేస్తవారిట మండలం జేబీకే పురంలో హెల్పర్ ఎం.వెంకటరమణ, కంభం మండలం లింగాపురంలో పంటపొలాల్లో యర్రబాలేనికి చెందిన పి.వెలుగొండయ్య, మే నెలలో బేస్తవారిపేటలో ఉప్పలపాటి చందు, రెండు వారాల క్రితం కంభం మండలం కందులాపురంలో ఓ గృహంలో విద్యుత్ షాక్‌కు గురై రాధేశ్యాం అనే యువకుడు మృతి చెందారు. అలాగే 17 సార్లు జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో సుమారు 30కి పైగా గేదెలు, మరికొన్ని మేకలు మృత్యువాతపడ్డాయి.

నష్టపరిహారం పొందొచ్చు

రైతులు పంట పొలాల్లో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందితే రూ.5 లక్షలు, గేదెలు చనిపోతే దాని విలువను బట్టి గరిష్టంగా రూ.40 వేల వరకు పరిహారం అందిస్తారు. గ్రామాల్లో ప్రధాన విద్యుత్ తీగల వల్ల ప్రమాదం సంభవించి మృతి చెందినా నష్ట పరిహారం పొందవచ్చు. అందుకోసం పోస్టుమార్టం రిపోర్టు, ఎఫ్‌ఐఆర్ కాపీ, మరణ ధ్రువీకరణ పత్రం, వీఆర్వో ధ్రువీకరణ పత్రం, ఫొటోను జత పరిచి దరఖాస్తు చేసుకుంటే విద్యుత్ శాఖాధికారులు పరిశీలించిన అనంతరం నష్టపరిహారం మంజూరు చేస్తారు.

పరిహారానికి సిఫార్సు

విద్యుత్ షాక్‌కు గురై గేదెలు చనిపోతే రూ.40 వేలు, మనిషి చనిపోతే రూ.5 లక్షల వరకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే వివరాలు నమోదు చేసుకుని నష్టపరిహారం కోసం సిఫార్సు చేసి పంపిస్తాం. వర్షాలు కురుస్తున్నందున రైతులు, ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.
– శ్రీనివాసరెడ్డి, డీఈఈ, కంభం

సీఎం గారూ.. నా భర్తను కాపాడండి



కలెక్టరేట్ వద్ద ప్లకార్డు ప్రదర్శిస్తున్న సురేంద్ర భార్య విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు

ఒంగోలు టౌన్: 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారూ.. నా భర్త ప్రాణాలు కాపాడండి.. వైద్యపరంగా చికిత్స కోసం సాయం అందించండి' అంటూ గిద్దలూరుకు చెందిన కందుల విజయలక్ష్మి వేడుకున్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆమె పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించారు. తన భర్త సురేంద్ర మార్కాపురానికి చెందిన సుబ్బారెడ్డి వద్ద లారీ కొనుగోలు చేశారని, రూ.2.25 లక్షలకు బేరం మాట్లాడుకుని రూ.1.50 లక్షల అడ్వాన్స్‌గా ఇచ్చారని వివరించారు. మిగతా డబ్బు ఫైనాన్స్ ద్వారా చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారని, అయితే లారీ చూసి రావడానికి వెళ్లిన రోజే తమ లారీ ఒకటి ప్రమాదానికి గురవడంతో సురేంద్ర సెంటిమెంట్‌గా భావించారని, దాంతో లారీ వద్దని సుబ్బారెడ్డికి చెప్పినట్లు తెలిపారు. ఈ విషయంలో సుబ్బారెడ్డితో విభేదాలు రావడంతో పోలీసులతో కలిసి వేధిస్తున్నారని, మనస్తాపానికి గురైన తన భర్త గడ్డిమందు తాగి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని విలపించారు. తన భర్త నంద్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య ఉన్నాడని, తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ఇదిలా ఉండగా 2024 నవంబర్‌లో సురేంద్రకు లారీ విక్రయించినట్లు సుబ్బారెడ్డి చెబుతున్నారు. అప్పటి నుంచి ఫైనాన్స్ కిస్తీలు సక్రమంగా చెల్లించకుండా లారీ తిప్పుకొంటున్నారని, ఫైనాన్స్ విషయంలో వచ్చిన సమస్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

పోలీసులపై ఆరోపణలు అవాస్తవం : డీఎస్పీ నాగరాజు

సురేంద్ర కుటుంబ సభ్యులు పోలీసుల మీద చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మార్కాపురం డీఎస్పీ నాగరాజు చెప్పారు. సురేంద్ర రెడ్డి ఒక లారీని మిస్సింగ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని, విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిచారని వివరించారు. సురేంద్రను కొట్టలేదని, వివరాలు కనుక్కొని పంపించి వేశామన్నారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవం

మార్కాపురం టౌన్: హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మార్కాపురంలోని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శుభవాణి బుధవారం తీర్పు వెల్లడించారు. తర్లుపాడు మండలం గానుగపెంట గ్రామానికి చెందిన పఠాన్ ఖాశింఖాన్‌ను 2015 జూన్ 21న మార్కాపురం మండలంలోని రాయవరం సమీపంలో బాషా టిఫిన్ బంకు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. తన భర్తకు వ్యవసాయ భూమి విషయంలో షేక్ సుబానీ, అతని మనుషులతో గొడవలు జరిగాయని, వారే హత్య చేసి ఉండవచ్చని మార్కాపురం రూరల్ పోలీసులకు ఖాశింఖాన్ భార్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి సీఐ కరుణాకర్‌రావు కేసు దర్యాప్తు చేశారు. తర్లుపాడు మండలం గానుగపెంట గ్రామానికి చెందిన పఠాన్ సుబానీ అలియాస్ గడ్డ అలియాస్ గడ్డగాడు, రాయవరం రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన షేక్ బాషా అలియాస్ లేషా, ఇదే ప్రాంతానికి చెందిన సయ్యద్ మాబుసుబానీ, సయ్యద్ బడే హుస్సేన్‌ను నిందితులుగా గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు ట్రయల్ నడుస్తున్న క్రమంలో సయ్యద్ మాబుసుబానీ, సయ్యద్ బడే హుస్సేన్ మృతి చెందారు. బుధవారం తుది విచారణలో నేరం రుజువు కావడంతో పఠాన్ సుబానీ, షేక్ బాషాకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.బాలునాయక్ పేర్కొన్నారు. ఒక్కో నిందితుడికి రూ.1,000 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. నేరస్తులకు శిక్ష పడేలా కోర్టులో సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టిన అప్పటి సీఐ కరుణాకర్‌రావు, ప్రస్తుత సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్సై అంకమరావు, లైజన్ హెడ్ కానిస్టేబుల్ ఐవీ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ కిషోర్‌కుమార్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి, చుండూరి



వైఎస్ జగన్‌తో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చుండూరి రవిబాబు



వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

ఒంగోలు సిటీ/యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షుడు చుండూరి రవిబాబు తదితరులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్ జగన్‌కు ప్రకాశం జిల్లా లీగల్ టీమ్ సభ్యులను చెవిరెడ్డి, చుండూరి పరిచయం చేశారు. లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, లీగల్ టీమ్ సభ్యులు ధర్నాసి హరిబాబు, కాకుటూరి సంపత్‌కుమార్, కత్తి కోటేష్‌బాబు, బి.నాగమల్లేశ్వరరెడ్డి, నాయకులు రాయపాటి అంకయ్య, మలిశెట్టి దేవ, పులుసు సురేష్ తదితరులు ఉన్నారు.

వదిన కుమారుడు మరణించాడని.. గుండెపోటుతో బాబాయి మృతి



మృతి చెందిన దానియేలు

యర్రగొండపాలెం: వదిన కుమారుడు మరణించాడన్న విషయాన్ని జీర్ణించుకోలేక బాబాయి గుండెపోటుతో మరణించిన సంఘటన బుధవారం యర్రగొండపాలెంలో చోటుచేసుకుంది. మండలంలోని వీరభద్రాపురం గ్రామానికి చెందిన ఆలేటి అఖిల్ మంగళవారం నీటి కుంటలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి పిన్ని భర్త పెద్దారవీడు మండలంలోని చాట్లమడ గ్రామానికి చెందిన జి.దానియేలు(45) హైదరాబాద్‌లో బేల్దారి పని చేస్తుంటాడు. అఖిల్ మృతి విషయం తెలిసి యర్రగొండపాలెం వచ్చాడు. ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహాన్ని చూసిన తీవ్రంగా కలతచెందాడు. అఖిల్ మృతి చెందిన ఫారం పాండ్ పరిసరాలను పరిశీలిస్తూ దానియేలు ఒక్కసారిగా కుప్పకూలి కిందపడ్డాడు. బంధువులు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సంఘటనతో వీరభద్రాపురం, చాట్లమడ గ్రామాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి.

వేర్వేరు ఆలయాల్లో చోరీ

- రూ.2.40 లక్షల విలువైన ఆభరణాలు, రూ.25 వేల నగదు అపహరణ

జరుగుమల్లి(సింగరాయకొండ)/కొండపి: కొండపి నియోజకవర్గంలోని రెండు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి తెగబడ్డారు. జరుగుమల్లి మండలం ఎన్ఎస్ కండ్రిక కొత్తపాలెంలోని అంకమ్మ తల్లి ఆలయంలో రూ.70 వేల విలువైన వెండి కిరీటం, సుమారు రూ.20 వేల నగదు చోరీ అయినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- కొండపి మండలంలోని పెట్లూరు శివాలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు పడి నగలు దోచుకెళ్లారు. సుమారు రూ.1.50 లక్షల విలువైన ఆభరణాలు చోరీ అయ్యాయని గ్రామస్తులు తెలిపారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అంకారావు తెలిపారు.



పెట్లూరులో దర్యాప్తు చేస్తున్న ఏఎస్సై

మర్రిపూడిలో రెవెన్యూ రికార్డుల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

మర్రిపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ రికార్డులను కనిగిరి ఆర్‌డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని గుండ్లసముద్రంలో సర్వే నంబర్ 571లో ఉన్న 207.86 ఎకరాల పశువుల బీడులో నిబంధనలకు విరుద్ధంగా కొంత భూమిని అధికారపార్టీ నాయకులు ఆన్‌లైన్ చేయించుకున్నారు. దీనిపై ఈ నెల17న 'పశువుల బీడు ఫలహారం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైంది. అలాగే మండల కేంద్రమైన మర్రిపూడిలో లక్ష్మీనృసింహస్వామి కొండ సమీపంలో సర్వే నంబరు 990–1లో 327.27 ఎకరాల భూమి ఉంది. దీనిలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని అప్పటి జిల్లా కలెకర్ట్ బ్లాక్‌లిస్టులో పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నెల 25వ తేదీ ఆదివారం రోజున తహసీల్దార్ జ్వాలా నరసింహారావు తమ సిబ్బందితో కలిసి సర్వే నంబర్ 990–1లో కొంత భూమిని టీడీపీ సానుభూతిపరులకు ఆన్‌లైన్ చేయడంతో అసలైన భూ హక్కుదారులు కార్యాలయానికి వచ్చి గగ్గోలుపెట్టారు. ఈ విషయంపై ఈ నెల 26న 'పచ్చనేతల తెగింపు.. తహసీల్దార్ బరితెగింపు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. వీటిపై స్పందించిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా విచారణకు ఆదేశించడంతో ఆర్‌డీఓ బుధవారం రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. గుండ్లసముద్రం, మర్రిపూడి భూరికార్డుల తనిఖీ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.



మర్రిపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్‌డీఓ వాహనం

31, జూన్ 1న క్రికెట్ జట్ల ఎంపిక

ఒంగోలు: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఉత్తర్వుల మేరకు ఈ నెల 31న, జూన్ ఒకటో తేదీన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రికెట్ జట్లను ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. అండర్–19, అండర్–23, సీనియర్ పురుషుల క్రికెట్ జట్లను ఎంపిక చేయనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ ఒకటో తేదీ ఉదయం 8.30 గంటలకు మహిళల అండర్–15, అండర్–19 జట్లను స్థానిక మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్‌లో ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా వైట్ డ్రస్, షూస్, సొంత కిట్, వయసు ధ్రువీకరణ పత్రం(ఫారం 5), ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. అండర్–23 విభాగంలో హాజరయ్యేవారు 2002 సెప్టెంబర్ 1 తర్వాత, అండర్ 19 విభాగంలో హాజరయ్యేవారు 2006 సెప్టెంబర్ 1 తర్వాత, అండర్ 15 విభాగంలో హాజరయ్యేవారు 2010 సెప్టెంబర్ 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఎంపికైన క్రీడాకారులు జూన్‌లో మంగళగిరి, పేరేచర్ల, మూలపాడు మైదానాల్లో నిర్వహించే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 97010 22333, 92462 22999ను సంప్రదించాలని సూచించారు.

30న రగ్బీ జట్ల ఎంపిక

మార్కాపురం: జిల్లా జూనియర్ బాలబాలికల రగ్బీ జట్లను ఈ నెల 30న మార్కాపురం జెడ్పీ బాయ్స్ హైస్కూల్లో ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ గణేష్ తెలిపారు. క్రీడాకారులు తమ పేర్లను ఆరోజు ఉదయం 8 గంటలకు పాఠశాల పీడీ జాహ్నవి వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన జట్లు జూన్‌లో కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మాజీ సీఎం ఎన్టీఆర్‌కు నివాళి




ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఒంగోలు సబర్బన్: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా బుధవారం ఒంగోలు అద్దంకి బస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్ఓ చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, మెప్మా పీడీ శ్రీహరి, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

గుండ్లకమ్మ కాలువలో వృద్ధుడి మృతదేహం

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వద్ద ఉన్న గుండ్లకమ్మ రిజర్వాయర్ కుడి కాలువలో బుధవారం గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం వెలుగుచూసింది. సీతారాంపురం గ్రామ సమీపంలో ఉన్న కుడి కాలువలో సుమారు 65 నుంచి 70 ఏళ్ల మధ్య వయసుగల వ్యక్తి మృతదేహాన్ని స్థానిక రైతులు గమనించి వీఆర్వోకు తెలియజేయడంతో ఆయన మద్దిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శరీరం ఉబ్బి చర్మం ఊడిపోవడంతో సుమారు రెండు రోజుల ముందు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. గ్రామాల్లో ఎవరైనా వృద్ధుడు అదృశ్యమైనట్లయితే మద్దిపాడు పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్సై శివరామయ్య సూచించారు.

ఏషియన్ అడ్మిరబుల్ అచీవర్స్‌లో మధుసూదన్‌కు స్థానం



మధుసూదన్‌శాస్త్రి

మార్కాపురం: గిన్నిస్ బుక్‌తో సమానమైన ఏషియన్ అడ్మిరబుల్ అచీవర్స్ బుక్‌లో మార్కాపురం పట్టణానికి చెందిన డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ శాస్త్రికి స్థానం దక్కింది. సంబంధించిన పత్రాలను అందుకున్న ఆయన అవార్డు వివరాలను బుధవారం విలేకరులకు వెల్లడించారు. ఆసియా ఖండంలో విశిష్ట సేవలు, అత్యంత ప్రతిభ కనపరిచిన వారి విశేషాలను ఈ బుక్ ప్రచురిస్తుంది. ఈ ఏడాది విడుదల చేసిన బుక్‌లో మొత్తం 498 మంది వివరాలు ఉండగా అందులో 13వ వాల్యూంలో మధుసూదన్‌శాస్త్రి వివరాలు నమోదు చేశారు. 1980 నుంచి న్యూఢిల్లీకి చెందిన రవి భూషన్ ఏషియన్ అడ్మిరబుల్ అచీవర్స్ బుక్ ప్రచురిస్తున్నారు. ఈ పుస్తకంలో మధుసూదన్ తండ్రి వేణుగోపాల కృష్ణమూర్తి 1988లో చోటు సంపాదించడం విశేషం. ఈ సందర్భంగా ఆయనను ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గోపాలుని హరిహరరావు, విశ్రాంత విద్యాశాఖ ఆర్‌జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి తదితరులు అభినందించారు.